క్లుప్తంగా

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



మాయలూరు సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

ఉయ్యాలవాడ : మండలంలో రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని మాయలూరు రైతు సేవా కేంద్రంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సాగు చేసిన ప్రతి పంటను క్షేత్రస్థాయికి వెళ్లి రైతులతో కలిసి ఈ క్రాప్ చేయాలన్నారు. అలాగే త్వరలో ప్రారంభం కానున్న రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులపై పూర్తి స్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. యూరియా డీబీటీ, ఈ పాస్ మిషన్ ఎంట్రీని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈఓలు సునీత, రాణెమ్మ పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు మంజూరు

శిరివెళ్ల: మండలంలోని గ్రామ పంచాయతీలకు 15 ఆర్థిక సంఘం 2024–25 ఆర్థిక సంవత్సరం 2వ విడత బేసిక్, టైడ్ గ్రాంట్‌లు మంజూరయ్యాయని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప సోమవారం తెలిపారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ శిరివెళ్లకు రూ. 29.88 లక్షలు, యర్రగుంట్ల రూ. 12.58, గోవిందపల్లె రూ. 13.48, గుంప్రమాన్‌దిన్నె రూ. 6.53, జీనేపల్లె రూ. 2.68 , వనికిదినిదిన్నె రూ. 2.25 , కోటపాడు రూ. 4.73, చెన్నూరు రూ. 6.45, గంగవరం రూ. 3.87, బోయలకుంట్ల రూ. 6.28, గుండంపాడు రూ. 3.60, మోత్కలపల్లె రూ. 2.31, వెంకటాపురం రూ. 2.43, వీరారెడ్డిపల్లె రూ. 2.38 , కామినేనిపల్లెకు రూ. 3.72 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులు ఆయా పంచాయతీలలో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు,తాగునీటికి వెచ్చించాల్సి ఉంటుందన్నారు.

నేడు హ్యాండ్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

శిరివెళ్ల: ఈ నెల 9వ తేదీన యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ మినీ అండర్–12 పోటీలకు క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి మహబూబ్‌బాషా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2013, 14, 15వ సంవత్సరాల్లో జన్మించిన బాల బాలికలు ఎంపిక పోటీలలో పాల్గొనవచ్చన్నారు. త్వరలో డోన్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో క్రీడాకారులు ఆడనున్నారన్నారు.

పంచాయతీ కార్యాలయానికి రూ. 32 లక్షల మంజూరు

ఉయ్యాలవాడ : మండలంలోని రూపనగుడిలో గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి రూ. 32 లక్షలు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ వెంకటయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ టెండర్ ప్రక్రియ కూడా పూర్తైందని మూడు రోజుల్లో పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ ప్రసాద్‌బాబు

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌గా ప్రసాద్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ సువర్ణాదేవిని నంద్యాల కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. స్థానిక రెవె న్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ గా ఉన్న ప్రసాద్ బాబు పూర్తి స్థాయి తహసీ ల్దార్ బాధ్యతలు ఉన్నతాధికారులు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు లో ఉంటూ రెవెన్యూ సేవలు అందిస్తామన్నారు.

విద్యతోనే అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

నంద్యాల(న్యూటౌన్): చదువుకోవడం ద్వారానే ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధ్యమని రామకృష్ణ డిగ్రీ కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని కళాశాల చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1965సంవత్సరంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. వ్యక్తి నైపుణ్యతకు, నైతిక విలువలకు, విజ్ఞానానికి, సామాజిక విలువలకు విద్య మూలమని తెలిపారు. అలాగే పేదరిక నిర్మూలన, ఉద్యోగ అవకాశాలకు విద్య తప్పని సరి అని అన్నారు. ప్రభుత్వాలు 100శాతం విద్యను ప్రజలకు అందించుటకు వయోజన విద్యావిధానం తీసుకొచ్చాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బయ్య, కళాశాల డైరెక్టర్ ప్రగతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ఆగ్రహం



గత ప్రభుత్వం ఏపీకి తీసుకొచ్చిన మెడికల్‌కాలేజీలను కూటమి సర్కారు ప్రైవేటీకరణ చేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్‌భాగస్వామ్యం (పీపీపీ)ముసుగులో పది మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రైవేట్‌కు ధారదత్తం చేశారు. బలహీన వర్గాలకు ఉచిత విద్యను దూరం చేసే ఈ విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శివకృష్ణ, నంద్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కూటమి సర్కారు తీరును నిరసిస్తూ సోమవారం నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్ ఆర్చి వద్ద విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే ఏర్పాటు చేసి నిర్వహించాలని, లేకపోతే ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌పీఎస్ యువజన విభాగం నాయకులు మనోహర్, వెంకటేష్, మహమ్మద్ అలీ, రవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

–నంద్యాల(న్యూటౌన్)

భయపెడుతున్న వీధికుక్కలు



ఆస్పత్రిలో బాధితులు



వీధి కుక్కలు జనంపై దాడులు చేస్తూ బెంబేలెత్తిస్తున్నాయి. రోడ్లపై, ఇళ్ల వద్ద, దుకాణాల వద్ద అవి స్వైర విహారం చేస్తూ స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. చాగలమర్రిలో కుక్కల బెడద మరీ ఎక్కువగా ఉంది. ఈ రెండువారల్లోనే 20 మందిపై దాడి చేసి గాయపరిచాయి. బాధితుల్లో చిన్నారులు, వృద్ధులూ ఉన్నారు. చికిత్స కోసం ఆసుపత్రుల చుట్టు తిరుగుతున్నారు. మండలకేంద్రంలోని ప్రధాన వీధుల్లో పగలు, రాత్రి తేడా లేకుండా కుక్కలు గుంపులు, గుంపులుగా సంచరిస్తున్నాయి. కుక్కల బెడదపై పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

–చాగలమర్రి

సెల్‌కు దూరంగా..కాసేపు సరదాగా



ప్రస్తుతం ఏమాత్రం సమయం దొరికినా జనాలు సెల్ మాయలో పడి ప్రపంచాన్ని మరచిపోతున్నారు. మరికొందరు టీవీలకు అతుక్కుపోతున్నారు. ప్రస్తుతం పల్లెల్లో ఎలాంటి పొలం పనులు లేక పోవడంతో ఈ పరిస్థితి మరీ ఎక్కువ. ఫోన్లు, టీవీలు అధికంగా చూడటం వల్ల కంటి చూపు తగ్గడంతో పాటు శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఇప్పటికే ఎంతో మంది చిన్నారులు సెల్‌ఫోన్ ప్రభావంతో అటు చదువులు, ఇటు ఆరోగ్యాన్ని కోల్పోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు మహిళలు సరదాగా బారకట్ట ఆడుతూ కాలక్షేపం చేస్తున్న దృశ్యం దొర్నిపాడు మండలం క్రిష్టిపాడులో సోమవారం కనిపించింది.

–దొర్నిపాడు

అర్జీలు గడువులోగా పరిష్కరించాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్



వినతులు స్వీకరిస్తున్న జేసీ విష్ణుచరణ్

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన అర్జీలను గడువులోగా పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసీతో పాటు, డీఆర్‌ఓ , డీఆర్‌డీఏ పీడీ తదితర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలు పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. కింది స్థాయి సిబ్బందిపై ఆధారపడకుండా స్వయంగా అధికారే బాధితులతో మాట్లాడి అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎవరైనా అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు 284 అర్జీలు అందజేశారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పీజీఆర్‌ఎస్‌లో కొన్ని వినతులు...

- డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన వి.పుల్లమ్మకు సర్వే నెంబర్ 181/4లో 4 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి 3.60 ఎకరాల భూమి మాత్రమే ఆన్‌లైన్‌లో ఎక్కింది. మిగతా 40 సెంట్లు కూడా ఆన్‌లైన్‌లో ఎక్కించాలని జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.
- ఆత్మకూరు మండలం వడ్లరామాపురం గ్రామానికి చెందిన కె.సరోజమ్మ సర్వేనెంబర్ 631లో 1.45 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి కొత్త పాసు పుస్తకం మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్‌ను కలిసి కోరారు.
- నంద్యాల ఆర్టీసీ డిపో నుంచి గోరుకల్లుకు వెళుతున్న బస్సును కొండజూటూరు గ్రామం వరకు నడపాలని పాణ్యం మండలానికి చెందిన కె. శ్రీనివాసరావు వినతిపత్రం సమర్పించారు.
- తొలగించిన దివ్యాంగ పెన్షన్‌ను పునరుద్ధరించాలని మండలకేంద్రం కొత్తపల్లికి చెందిన కె.భారతి జాయింట్ కలెక్టర్‌కు అర్జీ అందజేశారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేస్తున్న కార్మికులు

నంద్యాల(అర్బన్): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ఏఈసీఈఏ 3045 యూనియన్ ఉమ్మడి కర్నూలు జిల్లా నాయకులు ఎల్లాల శరత్‌కుమార్ విమర్శించారు. స్థానిక చాబోలు రస్తాలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం సాయంత్రం ఉమ్మడి కర్నూలు జిల్లా కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 పెండింగ్‌లో ఉన్న అరియల్స్‌తో పాటు 2026 పీఆర్సీ ఇవ్వాలన్నారు. కార్మికుల క్రమబద్ధీకరణ, వేతనాల పెంపు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తెలంగాణ ప్రభుత్వం తరహాలో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మధు, డివిజన్ అధ్యక్షుడు గోపాల్, సూరి యాదవ్, సుధాకర్, మోహన్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా మాన్యం భూముల కౌలు వేలం



పేరూరులో మాన్యం భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

రుద్రవరం: మండల పరిధిలోని పేరూరు ఈశ్వర, రామాంజనేయ స్వామి మాన్యం భూములకు సోమవారం దేవదాయ శాఖ అధికారులు కౌలు వేలం నిర్వహించారు. ఈఓ సాయిజయచంద్రారెడ్డి తెలిపిన వివరాల మేరకు ఆలయానికి దాదాపు 70 ఎకరాల మాన్యం ఉందన్నారు. ఆ భూములకు ఇన్‌స్పెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో కౌలు వేలం నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 70 ఎకరాలకు వేలం నిర్వహించగా రూ.6.12 లక్షలు వచ్చాయని గతేడాది కంటే రూ.1.20 లక్షల ఆదాయం తగ్గినట్లు ఆయన తెలిపారు. వేలం పాటలు ప్రశాంతంగా నిర్వహించేందుకు శిరివెళ్ల సీఐ దస్తగిరి బాబు, రుద్రవరం ఎస్‌ఐ మహమ్మద్ రఫీ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



నిల్వలను పరిశీలిస్తున్న ప్రసాదరావు

నంద్యాల(అర్బన్): పట్టణంలోని బైసాని ట్రేడర్స్, సంజీవరెడ్డి ఏజెన్సీస్, శివసంతోష్ ఏజెన్సీస్‌లలో సోమవారం సాయంత్రం ఇన్‌చార్జ్ ఏడీఏ ప్రసాదరావు ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో యూరియా, ఇతర ఎరువుల అమ్మకాలు, నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీలర్లు ఎమ్మార్పీ ధరకే ఈ పాస్ ద్వారా రైతులకు ఎరువుల అమ్మకాలు జరపాలన్నారు. స్టాక్ ధరల పట్టికలను ప్రతిరోజు అప్‌డేట్ చేయాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చట్టప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అవార్డు గ్రహీతలకు సన్మానాలు





శిరివెళ్లలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం, రుద్రవరంలో ఉత్తమ టీచర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

శిరివెళ్ల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యా య అవార్డు గ్రహీతలకు సన్మానాలు జరిగా యి. రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు గ్రహీత శేషఫణి, జిల్లా అవార్డు గ్రహీతలు ఉదయ్‌కుమార్, పద్మావతి, షేక్షావలిలకు హెచ్‌ఎం గోవిందరాజుల ఆధ్వర్యంలో టీచర్లు ఘనంగా సన్మానించారు. హెచ్ఎం మాట్లాడుతూ తమ పాఠశాలకు చాలా అవార్డులు రావడం గర్వకారణమన్నారు. రాష్ట్ర అవార్డు గ్రహీత ఇటీవలే పాఠశాల నుంచి పాణ్యంకు బదిలీఅయ్యారన్నారు.

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరం ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పి. సుదర్శన్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికకావడంతో సోమవారం సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు వీరరాఘవయ్య, లక్ష్మీదేవి తదితరులు ఉన్నారు.

రైతులకు తప్పని అవస్థలు



టేబుల్‌పై కుప్పగా ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలు

రుద్రవరం: మండలంలోని రైతులకు యూరియా కష్టాలు తొలగడం లేదు.మన గ్రోమోర్, రైతు సేవా కేంద్రాల వద్ద యూరియా బస్తాల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితిలు నెలకొన్నాయి. సోమవారం మండల పరిధిలోని ఎర్రగుడిదిన్నె రైతు సేవా కేంద్రం వద్ద పోలీసుల సమక్షంలో వ్యవసాయ సిబ్బంది యూరియా పంపిణీ కార్యక్రమం చేపట్టారు.విషయం తెలియగానే రైతులు అక్కడికి పరుగులు తీశారు. రైతుల సంఖ్య పెరగడంతో పోలీసులు, వ్యవసాయ సిబ్బంది కలిసి అక్కడికి వచ్చిన రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలు తీసుకొని టేబుల్‌పై కుప్పగా పేర్చారు.వ రుసగా పేర్లు పిలుస్తామని అప్పుడు ఒక్కొక్కరుగా వచ్చి యూరియా బస్తాలు తీసుకెళ్లాలని చెప్పారు. చేసేది లేక రైతులంతా తమ పుస్తకాలు వారికి ఇచ్చి గంటల తరబడి అక్కడే వేచి ఉన్నారు.అనంతరం వచ్చిన రైతులకు ఒక్కొక్కరికి రెండు బస్తాల ప్రకారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతంలో ఎప్పుడు ఈ విధంగా ఇబ్బంది పడలేదని కూటమి ప్రభుత్వం వచ్చాకే యూరియా కష్టాలు మొదలయ్యాయని వాపోయారు.

30శాతం మధ్యంతర భృతి చెల్లించాలి

గోస్పాడు: 30 శాతం మధ్యంతర మృతి చెల్లించాలని పీఆర్‌టీయూ గోస్పాడు మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. గోస్పాడు మండలంలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్‌సీ కమిషన్ నియమించడం ఆలస్యమవుతున్నందున 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కరువుభత్యం ప్రకటించాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలు పెంచాలన్నారు. కేజీబీవీ టీచర్స్‌కు మినీమం టైమ్ స్కేల్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భాస్కరుడు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విజయరావు, జిల్లా నాయకులు సురేష్‌కుమార్, రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలి

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జిల్లా సంఘానికి ఈనెల 26న జరిగే ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని సంఘం మాజీ అధ్యక్షుడు తోట రాజగోపాల్ కోరారు. స్థానిక సంఘం ఆవరణలో రామసుబ్బయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం బలోపేతం కావాలన్నా..పారదర్శకంగా పనిచేయాలన్నా మంచి నాయకత్వం అవసరమన్నారు. కార్యక్రమంలో నాయకులు గఫార్, లింగస్వామి, మల్లారెడ్డి, కాశింవలి తదితరులు పాల్గొన్నారు.

చెంచు కాలనీలో ప్రత్యేక వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారిని పి.అంజలి

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రి పీహెచ్‌సీ పరిధిలోని చాగలమ్మ చెంచు గూడెం కాలనీలో ప్రభుత్వ వైద్యాధికారిణి పి.అంజలి ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 32 మందిని పరీక్షించి అవసరమైన వైద్యం అందించారు. అనంతరం ఆళ్లగడ్డ సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, పంచాయతీ ఈఓ తారకేశ్వరి ఆధ్వర్యంలో చెంచు గూడెం కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.ఇందులో భాగంగా మురుగు కాలువలను శుభ్రపరచి, చెత్తాచెదారం తొలగించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రవణమ్మ, సూపర్‌వైజర్ శివరామ లింగారెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యూకేటర్ విజయ భారతీ, హెల్త్ అసిస్టెంట్లు మనోహర్, గర్లేట్ ఆశ కార్యకర్తలు పుష్పలత, శారదా తదితరులు పాల్గొన్నారు.

యూరియా సమస్య కనపడదా?



నంద్యాల పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, రైతులు

- కూటమి సర్కారును నిలదీసిన వామపక్ష నాయకులు
- రైతులకు అవసరమైన ఎరువులు అందించాలని డిమాండ్

నంద్యాల(అర్బన్): యూరియా దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కూటమి సర్కారు కనబడనట్టు వ్యవహరిస్తోందని రాయలసీమ సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి, సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు మండిపడ్డారు. జిల్లాలోని రైతులందరికీ సరిపడ ఎరువులు సకాలంలో అందించాలని కోరుతూ సీపీఐ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం మార్కెట్ యార్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులను యూరియా సమస్య వేధిస్తోందన్నారు.దుకాణాలు, రైతు సేవా కేంద్రాల వద్ద పడిగాపులుకాస్తున్నారన్నారు. అయినా, సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. సుపరిపాలన అందిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీలేదన్నారు. ఎరువుల కొరత లేకపోతే పోలీసులను పెట్టి ఎరువుల పంపిణీ చేయాల్సిన పరిస్థితి ఎందుకు వస్తుందన్నారు. యూరియా కోసం రైతన్నలు పడుతున్న అవస్థలను మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు రైతు సేవా కేంద్రాల వద్దకు వచ్చి చూడాలన్నారు. సీజన్ అయిపోయిన తర్వాత ఎరువులు అందిస్తే ప్రయోజనం లేదన్నారు. ఎరువుల దుకాణాల్లో యూరియా బస్తా రూ.400 నుంచి రూ.600తో అమ్మకాలు జరుపుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. కృత్రిమ కొరత సృష్టిస్తున్న ఎరువుల దుకాణాలను సీజ్ చేసి పీడీయాక్టు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సోమన్న, సీపీఎం నాయకులు రామచంద్రుడు, రైతు సంఘం నాయకులు భాస్కర్, ప్రసాద్, నాగరాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర ఇవ్వాలి



జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం కింద సంవత్సరానికి రూ.25 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఏపీ ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి చైన్‌సింగ్‌లు అన్నారు. సోమవారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు కల్పించడంతో ప్రయాణికులనే నమ్ముకున్న ఆటో డ్రైవర్ల పరిస్థితి దీనంగా మారిందన్నారు. కుటుంబాలు, జీవన పరిస్థితి ఇబ్బందికరంగా ఉందన్నారు. ప్రైవేటు, ఫైనాన్స్ కంతులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, టెస్టింగ్ చేసే ట్రాక్‌లను ప్రైవేటు సంస్థలకు అప్పగించి ఆటోమేటిక్ సెన్సార్ టెస్టింగ్ ట్రాక్ సిస్టమ్ ద్వారా లైసెన్స్‌లు జారీ చేసే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రవాణా రంగంలో వివిధ జీవోలతో సంక్షోభంలో ఉందన్నారు. పెరిగిన నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు, ఇన్సురెన్స్ రేట్లు, గ్రీన్ ట్యాక్స్, లైఫ్ ట్యాక్స్ ఇలా అనేక రూపాల్లో ప్రభుత్వానికి చలానా రూపంలో చెల్లిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు నాగరాజు, నరసింహ, ఇబ్రహీం, ఓబులేసులతో పాటు నంద్యాల, శిరివెళ్ల, మహానంది, పాణ్యం ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల గోడు పట్టని సర్కారు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జయరాం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వానికి ఉపాధ్యాయులు, ఉద్యోగుల గోడు పట్టడం లేదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యులు సాంబశివుడు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు జయరాం మండిపడ్డారు. సోమవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ప్రయోజనం లేదన్నారు. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కనీసం దసరా పండుగ కానుకగా ఒక డీఏనైనా ప్రకటించాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ కాల పరిమితి ముగిసి రెండేళ్లు గడిచినా 12వ పీఆర్సీ కమిషన్ వేయలేదన్నారు. తక్షణమే నూతన వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేసి 30శాతం మధ్యంతర భృతి ప్రకటించి అమలు చేయాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 30వేల కోట్ల ఆర్థిక బకాయిలను ఉపాధ్యాయ, ఉద్యోగ కార్మికులకు దశల వారీగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల విషయంలో కూటమి సర్కారు దుర్మార్గంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు గోపాల్‌రావు, జయరాం, రవిశంకర్‌రావు, శేషయ్య, మునిస్వామి, రాముడు, ప్రతాపరెడ్డి, గురువయ్య, వెంకటరామిరెడ్డి, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యూరియాను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు



దుకాణాదారులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ శాఖాధికారి

రుద్రవరం: యూరియాను పక్కదారి పట్టించి కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేసే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖాధి కారి సుమతి హెచ్చరించారు.స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఆమె మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా యూరియా సమస్య అధికంగా ఉందన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని చెప్పారు.అలా కాకుండా గుట్టు చప్పుడు కాకుండా పక్కదారి పట్టించి స్టాకు లేదని చెప్పి రైతులకు అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. అలాగే ప్రతి దుకాణాదారుడు స్టాకు రిజిస్టర్, బిల్లు బుక్కుల నిర్వహణ తప్పని సరిగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారులు రాజు, ఫయిమా తబస్సుమ్ ఉన్నారు.